# ఆకు రాలు కాలం

మధ్యాహ్నా రెండు గంటలు కాబోతుంది.

పార్వతికి మనసంతా ముళ్ళు ముళ్ళుగా ఉంది. భర్త శంకరయ్య మనసూ గుబులు గుబులుగానే ఉంది. భార్యాభర్తలిద్దరికీ ఒకరి మనసు మరొకరికి తెలుసు.

శంకరయ్య అన్నం తింటున్నాడు. కంచంలో మెతుకులు కెలుకుతూ పరధ్యానంగా వున్నాడు. భర్త మొహంలోకి చూసింది పార్వతి. ఆయన మొహం మీద చాలా నీడలు. నీలినీడలే కదలాడుతున్నై. 'నుదుటిరాత అంటారు ఈ గీతల్నేనేమో' అనుకుంది మొహం మీది చారల్ని చూసి.

చెప్పక తప్పదు. నిమ్మళంగా అన్నది. "పద్మకి ఇంకో పదిరోజుల్లో పురుడు రావచ్చని చెప్పింది డాక్టరమ్మ. నొప్పులనిపించగానే తీసుకు రమ్మంది"

తలెత్తి భార్యవైపు అదోలా చూసి, అంతలోనే చూపు మరల్చుకున్నాడు శంకరయ్య. "అవున్లేవే" అన్నాడు ముక్తసరిగా. తినటం అయిందనిపించి లేచాడు. ఎండిపోతున్న పెదవుల్ని నాలకతో తడుపుకుని అన్నమేం సయిస్తుందిలే అనుకుంది పార్వతి.

సమస్య ఇద్దరికీ తెలుసు. ప్రపంచకానికీ తెలుసు. దిగువ మధ్యతరగతి మొహాల గీతలన్నీ ఒకటే కత చెబుతాయి. సమస్యలన్నీ 'డబ్బు' అనే పళ్ళచక్రంలోనే నలుగుతూ వుంటాయి.

శంకరయ్య డ్యూటీకి వె ళ్ళిపోయాడు. ప్యూన్‌గా చేతికి అందితే నోటికి అందని జీతగాడు. పద్మ కాక ఇంకో ఇద్దరు ఆడపిల్లలు. జయా, రమణీ, ఎనిమిదీ, అరుక్లాసులు, వానాకాలపు చదువులు, ప్రభుత్వ పాఠశాల!

భర్త వాలకాన్ని తలచుకుంటేనే భయం భయంగా వుంటోంది పార్వతికి. మనసులో మాట చెప్పాడు. స్వయంపాకం మనిషి. ఫ్యాక్టరీలోనూ, చుట్టుప్రక్కలా కూడా శంకరయ్య 'నోట్లో' నాలుకలేని మనిషే.

పద్మ పురుటికొచ్చినప్పట్నుంచీ – ఎప్పుడూ మన్నుతిన్న పాములాగానే ఉంటున్నాడు. కొబ్బరిపుల్లకు గుచ్చిన మద్దికాయ లాగా బలవంతాన శరీరాన్ని మోస్తున్న వాడిలా ఊగిపోతున్నాడు.

శంకరయ్య కుటుంబంది బతికి చెడిన చరిత్ర. బియ్యపు వ్యాపారం చేసిన తండ్రి చనిపోగానే, అప్పులు తడిసి మోపెడంత అయి, ఉన్నదంతా పోయింది. వంద గజాల్లో నిలిచిన ఈ మూడు గదుల మిద్దె మిగిలింది. ఈయన చదివిన తొమ్మిదో క్లాసుకీ అప్పుడు అతికష్టం మీద ఈ ఫ్యూన్ పోస్ట్ దొరికింది.

తానూ రెండు ముద్దలు తిన్నాననిపించి నడుం వాల్చటానికి గోడవారగా చూసింది పార్వతి. మంచం మీద అపసోపాలు పడుతోంది పద్మ. ప్లాస్టిక్ వైరు మంచం. వేసుకున్న పాతచీర ముద్ద కట్టుకుని వోమూలకి చేరింది. పద్మకూతురు రెండేళ్ల రాణి చాప మీద దొర్లుతోంది. ఆ పిల్లదాని పక్కగా నడుం వాల్చింది పార్వతి.

గోడమీద కళ్ళముందు బొమ్మ వెంట బొమ్మగా ఆమె గతం కదలసాగింది.

నాలుగేళ్ళ కిందటి మాట.

పద్మ పెళ్ళి. సుధాకర్‌కి ఏదో కంపెనీలో ఎలక్ట్రికల్ పని అని చెప్పి అరవైవేలు కట్నం గుంజింది అతని తల్కిల. పెళ్ళి జరిగింది. తమమిద్దె సేఠ్‌జీ తనఖాలోకి వెళ్ళింది. ఆ అప్పు ఇంకా తీరలేదు. వడ్డీ కట్టటమే కష్టంగా ఉంది. అటు పద్మ సుఖమూ ఎండమావే అయింది.,

సుధాకర్‌కి సంపాదనేమీ లేదు. డబ్బు తెమ్మని పెళ్ళాన్ని పాటకి పదిసార్లు పుట్టింటికి తోలుతూ వుండటమే ఆయనగారి నిర్వాకం. అత్తమ్మ ఆరడీ ఆకాశమంత ఎత్తు. ఆ పిల్ల సంసారం నిప్పుల యేటి ఈతే. ఓ నలుసు కలిగితే ఈ బాధలు తగ్గుతాయేమోననుకుంటే, రాణి పుట్టిన తర్వాత పద్మ అవస్థ రెట్టింపయింది. ఒక దెబ్బకాదు, ఒక తిట్టుకాదు. రోజు రగడలూ, రచ్చలూ, నెలకి పదిహేనిరవై రోజులు పిల్లతో పాటు పద్మమకాం ఇక్కడే. ఇంతలోనే ఇదిగో – మళ్లీ నీళ్ళోసుకుంది. ఐదో నెల్లోనే పుట్టింటికి పంపి చేతులు దులుపుకున్నారు – మొగుడూ, అతని తల్లి.

"అమ్మా" అన్న పిలుపుకి పక్కకి తిరిగి లేచి కూర్చుని పద్మ వైపు చూసింది పార్వతి. "ఏవిటమ్మా" అంది చెయ్యి పట్టుకుంటూ.

"ఏవిటో భయంగా ఉందమ్మా" అంది పద్మ. తల్లి కళ్ళల్లోకి చూసింది. పార్వతి కళ్ళు బాధతో విలవిలలాడాయి.

"ఎందుకమ్మా? ఏం ఫర్వాలేదు. అంతా సాఫీగా జరుగుతుంది. డాక్టరమ్మ చెప్పింది గదా" ధైర్యం చెప్పింది. "దిగులు పడకు పద్మా, అన్నీ సవ్యంగా జరుగుతాయి" అని కూతురి చేతిని తన చేతిలోకి తీసుకుని "పిచ్చిపిల్ల" అన్నది. పద్మ కళ్ళల్లో నీళ్ళు ఉబికినై. వేలితో తుడిచింది పార్వతి. అంతటి నిబ్బరంలోనూ ఆమెకీ కళ్ళనీళ్ళు తిరిగినై.

"డబ్బు ఇబ్బంది ఎప్పుడూ వుండేదే కదా పద్మా. ఏం ఫర్వాలేదు. అవసరానికి ఆదుకునే వాళ్ళు ఉండనే ఉంటారు" అన్నది, తనను తాను సంభాళించుకుంటూనూ, కూతురికి నమ్మకం కలిగిస్తూనూ.

రాణి కాళ్ళతో కుస్తీ పట్టిపట్టి, జరిగి జరిగి, అమ్మమ్మ కాళ్ళమీదికి చేరి మునగదీసుకు పడుకుంది. రాణిని చేత్తో దగ్గరికి తీసుకుని సరిగా పడుకోబెట్టి లేచింది పార్వతి.

జయా, రమణీ వచ్చారు. రెండోపూట సెలవు స్కూలుకి. వాళ్ళకి తినటానికేదో పెట్టటానికి కదిలింది పార్వతి.

రాత్రి -

పార్వతితో అన్నాడు శంకరయ్య "అప్పటికి నాకేం ఇరవు దొరకటం లేదు పార్వతీ. సాయంత్రం సేఠ్‌జీ దగ్గరకి పోయెచ్చా, అగ్గిమీద గుగ్గిలంలా చిటపటలాడిపోతున్నాడు. వడ్డీనే సరిగ్గా ఇవ్వటం లేదని నానా మాటలన్నాడు.'

భర్త కళ్ళల్లోకి సరిగా చూడలేకపోయింది పార్వతి.

మాటలు కూడదీసుకుని 'మరిప్పుడెట్టాగయ్యా?' అన్నది,.

చాలా సేపటిదాకా శంకరయ్యేం మాట్లాడలేదు. ఆ తర్వాత తనకు తానే చెప్పుకుంటున్నట్టు గొణిగాడు. 'ఎట్టా జూసినా ఈ కొంపకి కాళ్ళొచ్చినట్టనిపిస్తోంది' అని.

పార్వతి మాట చాలించింది.

'పొద్దుబోయింది. పడుకోండి' అంటూ తానూ కళ్ళు మూసుకుంది.

వారం రోజులు గడిచినై.

ఈ వారంలోనూ చాలా సంఘటనలు త్వరత్వరగానే జరిగిపోయినై.

శంకరయ్య మిద్దె సేఠ్‌జీ చేతుల్లోకి వెళ్ళిపోయింది.

తొంభైవేలకి అమ్మకం. రిజిస్ట్రేషన్ పనులన్నీ చకచకా కానిచ్చుకున్నాడు సేఠ్‌జీ. పాత అప్పు – అసలూ, వడ్డీ పోను మిగిలిన పదహారువేలూ చేతికిచ్చాడు.

ఉన్న చారెడు కొంపా చేజారిపోయింది.

చేతిలోని పైసల్తో కాస్త వెసులుబాటు దొరికింది.

నెలకి వెయ్యి రూపాయల అద్దెతో శంకరయ్యా వాళ్లు ఆ ఇంట్లోనే వుండేట్టు ఒప్పందం కుదిరింది. శంకరయ్య జీతంలో మరికొంత లోటు!

అనుభవం కొండచిలువలా చుట్టేసుకుంది.

పద్మ కానుపయింది. పెద్దాపరేషన్‌తో పిల్లవాడు భూమ్మీద పడ్డాడు. ఆ వెంటనే పెనిమిటీ, అత్తా పద్మని చూసిపోవటానికి చేటంత మొహాలతో తయారయ్యారు. ఆ తర్వాత బారసాల తతంగం ఖర్చు సంగతి చెప్పేదేం వుంది. అదెప్పుడూ గుప్పిట పట్టని రాయివంటిదే!

రోజులు గడుస్తున్నై. కానీ,

అవి –శంకరయ్య సంసారాన్ని కరువుకు గురైన తోటని చేసేసినై.

శంకరయ్యకీ, పార్వతికీ – శరీరంలోనూ, మనసుల్లోనూ కూడా ఊష్ణం పెరిగిపోతూనే ఉంది.

నెల గడిచేసరికి,

పురుగుమీద పుట్రలా పెద్ద ఉపద్రవం వచ్చి పడింది. పద్మ పెనిమిటీ, అత్తా – శంకరయ్య ఇంటిమీది కొచ్చారు. ఇల్లు అమ్మిన డబ్బులో పద్మకీ వాటా వుందని లాపాయింట్ తెచ్చారు. ఇల్లు శంకరయ్య తండ్రిది కాబట్టి మనవరాలికి వారసత్వ భాగం రావాలని పట్టుబట్టారు. మొత్తం సొమ్ముని నాలుగు భాగాలు చేసి పంచమన్నారు.

ఆ అత్తమ్మ నోరు పెద్దది. చుట్టుపక్కల నలుగురూ చేరారు. వాళ్ళకిది ఉచిత వినోదం! సుధాకర్ మరీ రెచ్చిపోయాడు. డబ్బివ్వకపోతే– పెళ్ళాం పిల్లల్ని వదిలేస్తానని రచ్చ చేసిపోయాడు.

మూగవేదనతో – ఆ రాత్రి మళ్ళీ పద్మ తల్లితో అన్నది. 'నాకెందుకో భయంగానే వుందే అమ్మా' అని. కూతురి భయం తల్లి ధైర్యాన్ని కిందికి లాగింది. మ్రాన్పడిపోయి చతికిలబడింది పార్వతి.

బోనులో పడిన ఎలక పిల్లలా అయిపోయాడు – శంకరయ్య. వచ్చిందంతా సున్నకు సున్నా. హళ్ళికి హళ్ళీ అయిపోయిందని తెగేసి చెప్పేసింది పార్వతి. వియ్యపురాలూ, అల్లుడూ – తిట్టిన తిట్టు తిట్టకుండా యాగీ చేశారు.

'అయితే నోటు రాసివ్వండి' అని పట్టుబట్టింది పద్మ అత్తమ్మ. పిలవని పేరంటానికి వచ్చిన మధ్యవర్తులూ ఆమె పక్షానేన్ని పలికారు. అన్ని రాద్ధాంతాలూ అయిన తర్వాత – కూతురి మొహం చూసి మెత్తబడ్డాడు శంకరయ్య నోటు రాసిచ్చాడు.

ఇంట్లో శాంతీ, మనసుల్లో ప్రశాంతీ కరువైపోయాయి.

మామూలుగా మధ్యాహ్నం అన్నానికి ఇంటికొచ్చే శంకరయ్య ఇప్పుడు రావటం లేదు. రాత్రివేళల్లోనూ ఆలశ్యంగా వచ్చి నాలుగు మెతుకులు కతుకుతున్నాడు. భార్యమీద, పిల్లలమీద చిరాకూ విసుగూ ఎక్కువైనై.

గ్రాయికం తెలిసిన పిల్లలు. ఎంతగా నోరు కుట్టేసుక్కూర్చున్నా ఎప్పుడో, అప్పుడు మాట దూకుతుంది. మాట తియ్యగా మాట ఎప్పుడూ తుమ్ముల్లో పొద్దుమొహాలు!

రెణ్ణెళ్ళు గడిచాయి.

పట్నం బైపాస్ పనులు మొదలైనాయి.

ఆ రోడ్డు ఈ మిద్దె పక్కగా పోతోంది. ఈ వార్త పట్నమంతా పాకి పోయింది. ఒక్కసారిగా ఇళ్ళకీ, భూములకీ ధరల రెక్కలొచ్చినై.

ఉన్నట్టుండి ఒకరోజున సేఠ్ ఊడిపడ్డాడు.

ఇల్లు ఖాళీ చేయమని కూర్చున్నాడు.

ఇంత హఠాత్తుగా ఎక్కడికి పోవడం? ఇల్లెక్కడ వెతుక్కోవాలి?

శంకరయ్యా, పార్వతీ –సేఠ్‌జీ కాళ్ళావేళ్ళా పడ్డారు.

వీల్లేదని వార్నింగిచ్చి వెళ్ళాడాయన.ఙ

ఆ నెల్లోనే –

ఊరికి ఉత్తరంగా చాలా దూరంలో రెండు గదుల వాటాలోకి మారింది శంకరయ్య కుటుంబం.

మరో వారం తిరక్కుండానే సేఠ్ ఆ మిద్దెని ఎవరికో అమ్మేశాడు. ఆ చేరెడు కొంపే ఆయనకి నాలుగు లక్షలిచ్చింది! చెడి అమ్ముకున్న ఇంటికి ఈనాటి విలువ!

సుధాకర్ నోటు పట్టకుని మామ ఇంటిమీద కొస్తూనే వున్నాడు. పద్మా పిల్లలూ పుట్టింట్లోనే వున్నారు.

శంకరయ్య గుండెకి దుఃఖపు పోటు తగిలింది. 'స్వయంపాకపు' మనిషి కదా!

ఆ రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత 'అమ్మా – ఇవ్వాళా భోంచేయలేదు కదూ?' అని.

తల్లి చూపులు మరల్చుకుంది. 'గురువారమే ఇవ్వాళ. నేను బాబా పేరున రాత్రుళ్ళు ఉపవాసం ఉంటున్నాను. అన్నది.

అప్పటికే ఆమె కంఠం రుద్ధమైంది!

ఈ కన్నీటి వెల– ఒంటిపూట భోజనాలు!!

చక్రనేమి క్రమంలో ఇది ఆకురాలు కాలం!!!

**–చినుకు మాసపత్రిక, ఆగస్టు 2010**